
# మీరు ఇంటి నుంచి ఏమి నేర్చుకోవాలి?

చినవీరభద్రుడు



ఎమెస్కో




ఇల్లనగానే ఎవరికన్నా ఒక వెచ్చని చోటు గుర్తొస్తుంది.

మీ కోసం అమ్మా, నాన్నా ఎదురుచూస్తుండే చోటది.

మీ అన్నదమ్ములో, అక్కచెల్లెళ్ళో మీ కోసం చేతులు చాపుతుండే చోటు.
మీకెవ్వరు లేకపోయినా, మీకసలో ఇల్లంటూ ఏదీ లేకపోయినా
మీరెక్కడ పుట్టిపెరిగారో ఆ చోటంటేనే మీకేదో చెప్పలేని ఇష్టం.

ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళండి, ఎంతదూరమన్నా ప్రయాణించి రండి,
మీదంటూ చెప్పుకోవడానికి మీరు ఇష్టపడేది మీరు పుట్టినచోటునే.

గుర్తుంచుకోండి, అన్నిటికన్నా ముందు ఇల్లుమీదంటూ
ఒక చోటుని, మీరు ఇష్టపడే చోటుని చూపిస్తుంది.
ఆ ఇష్టాన్ని జీవితమంతా గుర్తుపెట్టుకోవడం నేర్పుతుంది.



నేను కూడా ఆలోచిస్తున్నాను.
నేను పుట్టిన ఇంటినుంచి నేనన్నిటికన్నా ముందు ఏం నేర్చుకున్నానా అని.

నాకు గుర్తున్నవేమిటో తెలుసా? అన్నిటికన్నా ముందు బహుశా నేను అమ్మ ముఖాన్నే చూసుంటాను.
నాకులానే మీకు కూడా అమ్మముఖం కొత్తగా అనిపించి ఉండదు కదూ.
అమ్మని చూసిన మొదటిక్షణంలోనే మనకేవేవో చాలానే అర్థమయిపోయిఉంటాయి.

అమ్మని చూసినప్పుడే అవగాహనకూడా పుట్టివుంటుంది.

కొన్ని సంకేతాలు, కొన్ని గుర్తులు నెమ్మదిగా మనకి తెలియడం మొదలుపెడతాయి.
మా ఇంటి వెనక కొండలూ, సందులో నందివర్ధనం చెట్టూ నాకిప్పటికీ గుర్తే.
మీకు కూడా మీ బుజ్జి తువ్వాయో, మేకపిల్లో, మేఘాలో, పక్షులో ఇప్పటికీ గుర్తే కదూ.

ఇల్లు మనకి తొలి గురువు.



ఎదుగుతూ వస్తూంటావు నువ్వప్పుడు,
తప్పటడుగుల్తో, తప్పొప్పుల్తో,

నిన్నింకా బళ్ళో వెయ్యలేదు గానీ
నీ చదువప్పటికే మొదలయిందంటే నమ్ము.
నీ జీవితాన్నంతా ముందుకు నడిపించేవన్నీ నీకు తెలియకుండానే
నీ లోపల్లోపల మనసులో నాటుకుపోయాయంటే నమ్ము.

నీకప్పటికే కొన్ని నచ్చుతున్నాయనీ, కొన్ని నచ్చడం లేదనీ నీకే
తెలుస్తూంటుంది.
మీ అమ్మానాన్నలకీ తెలుస్తుంది.

ఎప్పుడో ఏ ఆటవేళనో నువ్వేదో పాటవిన్నావు.
నీకు తెలియకుండానే ఆ రాగం నీ మనసుకి పట్టేస్తుంది.

అప్పుడు నువ్వు ఆడుకుంటూ ఉన్నావు కదా,
ఆనందంగా ఉన్నావు కదా,
ఇక మళ్ళా అటువంటి రాగాల్ని నువ్వెప్పుడు విన్నా,
ఎక్కడ విన్నా నీకు తెలియకుండానే
నీ మనసెందుకో హాయిగా అయిపోతుంది.





అప్పుడు నిన్ను వెతుక్కుంటూ ఆటలొచ్చాయి, పాటలొచ్చాయి

బొమ్మల్లాంటి పిల్లలతో కలిసి బొమ్మలపెళ్ళిళ్ళు చేసావు.
నీ ఇంటవాకిట ఆటల్లో మళ్ళా నువ్వే ఇల్లు కట్టావు,
పందిరేసావు, నాన్నవయ్యావు, అమ్మవయ్యావు,
పీటని పల్లకి చేసి బొమ్మలకి పెళ్ళి చేసావు.
ఉత్తుత్తి వంటలతో ఊరంతా విందులు చేసావు.
అందరినీ వరసలు పెట్టి పిలిచావు.
విస్తర్లు వేసి పిండివంటలు వడ్డించావు.



దీన్నే కొత్తదనాన్ని సృష్టించడమంటారు.
నువ్వు ఆడుతూ పాడుతూ నీ చుట్టూ ప్రపంచనాన్ని మార్చేసావు.
నువ్వప్పుడొక కవివయ్యావు, చిత్రకారుడివయ్యావు,
నువ్వొక గాయనివయ్యావు, నర్తకివయ్యావు.

గుర్తుపెట్టుకో,
ఇంటినుంచి నువ్వు నేర్చుకున్న విద్యలన్నిటిలో అతిగొప్ప విద్య ఇదే.
ఆటపాటలతో ఇంటిని ఇంద్రధనసును చేసేసావు.



ఇల్లు అంటే ఒట్టి ఇటుకా సున్నమూ, కంచే, గడ్డికప్పూ,
డాబా, మేడమెట్లూ కావని నీకు నెమ్మదిగా తెలిసివస్తుంది.
ఇల్లంటే కొంతమంది కలిసి ఉండటమని నెమ్మదిగా తెలుసుకుంటావు.

మీ ఇంటికి చుట్టాలొస్తుంటారు.
మిత్రులొస్తుంటారు. అవసరమున్నవాళ్ళు ఒకటిరెండు రోజులు ఆశ్రయానికొస్తుంటారు.
వాళ్ళని స్వాగతించడం నేర్చుకోవాలని నాన్న చెపుతుంటాడు.

నా చిన్నప్పుడు ఎవరేనా ఇంటికొస్తే ముందుచేతులు జోడించి
వారికి నమస్కరించాలని మా నాన్న చెప్పేవాడు.
వాళ్ళని ఆదరంగా కూర్చోబెట్టి దాహం తీర్చడానికి మంచినీళ్ళివ్వాలనే వాడు.

చుట్టాలొస్తున్నారంటే ఆ ముందురాత్రంతా కంటికి కునుకుపట్టేదే కాదు.
ఇంటికెవరన్నా వస్తున్నారంటే వాళ్ళకోసం ఎదురుచూడటంలో
గొప్ప సంతోషముంటుందని గ్రహించాలి నువ్వు.

అసలెవరన్నా ఇంటికి ఎందుకొస్తారు?

మనిషికి మనిషిని చూస్తే మైమరపు కలుగుతుంది.
సొంతమనుషుల్ని చూసినప్పుడు ప్రాణం లేచివచ్చినట్టవుతుంది.
వాళ్ళకోసం మనమేదో ఒకటి చెయ్యాలనిపిస్తుంది.

అలాగని వాళ్ళేదో ఒకటి కోరుకుని మీ ఇంటికి వస్తున్నారనుకోకు.
వాళ్ళకి నిన్ను చూడటమంటే ఇష్టం.
అలాగే నీకు కూడా వాళ్ళని చూడాలని తహతహ కలగాలి.





ఇల్లంటే నలుగురి కలయిక.

నలుగురు కూచున్నప్పుడు నువ్వుకూడా వాళ్లతోపాటు జమకావాలి.
వాళ్ళు కష్టం పంచుకుంటే వాళ్లతో కలిసి కష్టం పంచుకోవాలి.
వాళ్ళు సుఖం పంచుకుంటే నువ్వు కూడా సుఖం పంచుకోవాలి.

నలుగురి మధ్యా నువ్వొక్కడివే ఒంటరిగా ఉండటం సబబుకాదు.
ఎవరేనా ఏదన్నా చెప్తున్నప్పుడు అడ్డుతగలకుండా వినాలి.

నీకు వాళ్ళ మాటలు అర్థం కాలేదనుకో,
మరొకసారి చెప్పండని నమ్రతగా అడగాలి
నలుగురికీ నవ్వుతూ జవాబివ్వాలి.



నీ వినయం, నువ్వు వాళ్లకిచ్చే గౌరవం
వాళ్ళ ముఖంలో చిరునవ్వులు పూయించిందనుకో,
అప్పుడు నువ్వు కూడా తృప్తిగా తలూపాలి.



పోను పోను నీకు చాలా విషయాలు తెలిసివస్తాయి.

ఇల్లంటే వెచ్చదనం, ఇల్లంటే సంతోషం, ఇల్లంటే పండుగలు,
పిండివంటలు మాత్రమే కాదని తెలుస్తుంది.
ఇల్లంటే విలువల్ని పెంచి పోషించుకోవడమని నీకే నెమ్మదిగా అర్థమవుతుంది.

విలువ అంటే ఏమిటో తెలుసా?

నువ్వు మిఠాయి తిన్నావనుకో, నోరంతా తీపవుతుంది.
మనసంతా తీపవ్వాలంటే ఏం కావాలో తెలుసా?
దేన్నిస్తే నీ మనసంతా తీపెక్కుతుందో దాన్నే విలువ అంటారు.

తక్కినవన్నీ తీసుకున్నప్పుడు ఆనందంగా ఉంటుంది.
అలాకాక ఇచ్చేటప్పుడు ఆనందం కలిగించేదే విలువ.

అమ్మని చూడు,
క్షణం కూడా విశ్రాంతి లేకుండా
అందరికీ అన్నీ అమర్చి చేతికందిస్తూ ఉంటుంది,
అన్నిటికన్నా విలువైంది అమ్మ ప్రేమ అని గ్రహించు.



నీ ఇంట్లో, నీ స్నేహితుల ఇళ్ళల్లో ఎక్కడెక్కడ
విలువలు నిలబడుతున్నాయో గుర్తించు.

నీ స్నేహితుడి తండ్రి ఆదరంగా చేతులు చాపి 'రా'
అని నిన్ను ఇంట్లోకి పిలిచాడనుకో,
నీకెంత సంతోషంగా ఉంటుంది.


పిల్లలు పదిమంది కలిసి ఆడుకుంటున్నారనుకో,
మీ మధ్య ఏ మాత్రం తేడా చూపనివాళ్ళనీ చూస్తే
మీకెంతో సంతోషంగా ఉంటుంది కదూ,

మనుషులందరినీ సమానంగా చూపడం అన్నిటికన్నా అతి గొప్ప విలువ.

నీకూ, చెల్లెలికీ మధ్య, లేదా
నీకూ తమ్ముడికీ మధ్య ఏ తేడా లేదని తెలుసుకున్నావనుకో,

పెద్దా చిన్నా ఎక్కువా, తక్కువా అన్న తేడా లేకుండా
అమ్మ అందరినీ ఎట్లా సమంగా చూస్తుందో చూడు,
నీ చుట్టూ ఉన్నవాళ్లందరినీ కూడా నువ్వో అమ్మలా చూడగలిగావనుకో,

అప్పుడు నువ్వెంత విలువైన పిల్లవాడివో అంటారంతా.





నువ్వు విలువల్ని చూడటంతోటే ఆగిపోకూడదు.
విలువల్ని కాపాడేవాడివిగా, సృష్టించేదానివిగా మారాలి.
అది మరింత ముఖ్యం.

అదెట్లా అంటావా?
ఇంట్లో చిన్న చిన్న పనుల్లో అమ్మకో, నాన్నకో సాయంగా ఉన్నావనుకో.
అదొక విలువ.


పుస్తకాలు చింపడం మానేసావనుకో,
నీళ్ళు వృథా చెయ్యడం లేదనుకో,
ఆహార పదార్థాల్ని పారెయ్యడం లేదనుకో,
అదొక విలువ.


అమ్మ చెప్పిన మాటకో, నాన్న ఇచ్చిన ఆజ్ఞకో
కట్టుబడి ఉన్నావనుకో,
అదొక విలువ.

నువ్వుంటున్న చోటునీ, దుస్తుల్నీ,
చేతుల్నీ  శుభ్రంగా ఉంచుకుంటున్నావనుకో,
అది కూడా విలువల్ని కాపాడుకోవడమే.

రానురాను అవి నీ అలవాట్లుగా మారిపోవాలి.
ఎటువంటి పరిస్థితి ఎదురుగానీ నువ్వెట్లా ప్రవర్తిస్తావో
ఎవరన్నా కూడా ఇట్టే ఊహించగలిగారనుకో,
దానర్థం విలువ నీ అలవాటుగా మారిపోయిందన్నమాట.







మొదట్లో నువ్వుగానీ నేను గానీ ఎవరన్నా గానీ నడవగలిగేవాళ్ళంకాదు.

కొన్నాళ్ళు నేలమీద పాకేవాళ్ళం.
నెమ్మదిగాపైకి లేచి తప్పటడుగులు వేసేవాళ్ళం.
అప్పుడు మన తల్లిదండ్రులు మన పక్కనే నించుని
చేతులడ్డుపెట్టేవాళ్ళు.

మనమొక అడుగు ముందుకి వెయ్యగానే
ప్రోత్సాహంతో చప్పట్లు కొట్టేవాళ్ళు.

కేరింతలాడేవాళ్ళు.

పొరపాటున మన అడుగు తడబడిందా
ఆతృతతో వెంటనే మనని పట్టుకుని

‘మానాన్నే, మా అమ్మే’అని గుండెకి హత్తుకునే వాళ్ళు.
గుర్తుపెట్టుకో, మనం పడిపోతామేమోనని
ఎప్పటికీ చంకనెత్తుకునే ఉండలేదు వాళ్ళు.

నువ్వొకటి రెండుసార్లు పడితే మాత్రమేం,
నీ అంతట నువ్వు నడిచిందాకా నడక నేర్పుతూనే ఉండేవాళ్ళు.






నీ అంతట నువ్వు నడవడం నేర్చుకున్నట్టే
మరొకర్ని చూసి నేర్చుకోవలసిన పని ఉండదు.

మరొకళ్ళు చెప్తేనేగాని చేసే అవసరమూ ఉండదు.

పొద్దున్నే నిద్ర లేవాలనుకో, మొదట్లో కొన్నాళ్ళు కష్టంగా ఉంటుంది.
రోజూ మీ నాన్న నిన్ను నిద్రలేపుతుంటే విసుగ్గా ఉంటుంది.
కొన్నాళ్ళకు నీ అంతట నువ్వే
పొద్దున్నే ఎవరూ చెప్పకుండానే నిద్రలేస్తావు.

అలా నీ అంతట నువ్వే ఒక పని చేసినప్పుడు నీకు చాలా బాగా అనిపిస్తుంది.
దాన్నే స్వతంత్రం అంటారు.
స్వతంత్రం అంటే నీకు బాగా అనిపించినవాటిని
నీకై నువ్వే సాధించుకోవడమన్నమాట.





స్వతంత్రం అంటే ఏదో ఒక పనిని
మనకై మనం చేసుకోగలగడం కాదు.

పొద్దున్నే లేచి కూడా నువ్వు నీ హోం వర్క్ నువ్వు చేసుకోవడం లేదనుకో.
మళ్ళా అమ్మనో, నాన్ననో నీ వెంటపడి
'అది చెయ్యి, ఇది చెయ్యి' అని చెప్పవలసి వస్తుంది.

అలా కాకుండా నువ్వేం పనులు చెయ్యాలో
నీ అంతట నువ్వే గుర్తు పెట్టుకోవాలి.
ఎవరూ మళ్ళా గుర్తు చెయ్యకూడదు.
ఒకదాని వెనక మరొకటి నీ అంతట నువ్వే చేసుకుంటూ పోవాలి.

అలా చెయ్యడంలో తడబాటు ఉండకూడదు. తొట్రుపడకూడదు.
స్థిమితంగా చేసుకుంటూపోవాలి.

అదీ నిజంగా స్వతంత్రంగా ఉండటమంటే.




ఇప్పుడొక్కసారి గుర్తుతెచ్చుకోండి.

ఇంటినుంచి మీరేమేమి నేర్చుకున్నారు?


ఇల్లంటే నలుగురి కలయిక,
వాళ్లతో నువ్వు కూడా సంతోషంగా కలవడం.
వాళ్లకేదన్నా నీకు చాతనయింది చెయ్యడం,
వాళ్ళని ఆనందంగా ఉంచడం నీకొక విలువగా,
ఆ విలువలు నీ అలవాట్లుగా మారిపోవడం,
మరొకరు చెప్పే పనిలేకుండా అటువంటి అలవాట్లు
నువ్వే స్వతంత్రంగా పాటిస్తూపోవడం.

అప్పుడు నువ్వు సంతోషంగా ఉంటావు.

నువ్వెక్కడుంటే అక్కడక్కడంతా
సంతోషం వెల్లివిరుస్తుంది.




## ఆంధ్రజ్యోతి-ఎమెస్కో పోటీలో బహుమతిపొందిన రచనల జాబితా



| | | |
|---|---|---|
| 1. | బడినేర్పిన పాఠాలు | - రూ. 50/- |
| 2. | గిరిజన పిల్లలు రాసిన కథలు - 1 | - రూ. 25/- |
| 3. | గిరిజన పిల్లలు రాసిన కథలు - 2 | - రూ. 25/- |
| 4. | ఉత్తరాంధ్ర పిల్లలు రాసిన కథలు - 1 | - రూ. 25/- |
| 5. | ఉత్తరాంధ్ర పిల్లలు రాసిన కథలు - 2 | - రూ. 25/- |
| 6. | కోస్తా పిల్లలు రాసిన కథలు - 1 | - రూ. 25/- |
| 7. | కోస్తా పిల్లలు రాసిన కథలు - 2 | - రూ. 25/- |
| 8. | రాయలసీమ పిల్లలు రాసిన కథలు - 1 | - రూ. 25/- |
| 9. | రాయలసీమ పిల్లలు రాసిన కథలు - 2 | - రూ. 25/- |
| 10. | తెలంగాణా పిల్లలు రాసిన కథలు - 1 | - రూ. 25/- |
| 11. | తెలంగాణా పిల్లలు రాసిన కథలు - 2 | - రూ. 25/- |

## చినవీరభద్రుడు రచనలు



| | | |
|---|---|---|
| 1. | మీరు బడిలో ఏమి నేర్చుకుంటారు? | రూ. 30/- |
| 2. | మీరు ఇంటిలో ఏమి నేర్చుకుంటారు? | రూ. 30/- |
| 3. | మీరు సమాజంనుంచి ఏమి నేర్చుకుంటారు? | రూ. 30/- |

## డా॥ బి.వి.పట్టాభిరామ్ రచనలు

### వెలుగుబాట

8 పుస్తకాల సెట్టు, ఒక్కొక్క పుస్తకం రూ. 30/-


1. ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్తలు
2. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు-1
3. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు-2
4. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు-3
5. స్ఫూర్తిప్రదాతలు -1
6. స్ఫూర్తిప్రదాతలు -2
7. స్ఫూర్తిప్రదాతలు -3
8. స్ఫూర్తిప్రదాతలు -4

### ఎదగడానికి 7మెట్లు

7 పుస్తకాల సెట్టు ఒక్కొక్క పుస్తకం రూ. 30/-

1. క్రమశిక్షణ - *(దుర్గాబాయి దేశ్‌ముఖ్)*
2. పట్టుదల - *(ఇందిరాగాంధీ)*
3. మనోబలం - *(మహాత్మాగాంధీ)*
4. ఆత్మాభిమానం - *(ఝాన్సీలక్ష్మీబాయి)*
5. దేశభక్తి - *(భగత్‌సింగ్)*
6. స్వయంకృషి - *(లాల్‌బహదూర్‌శాస్త్రి)*
7. ఆత్మవిశ్వాసం - *(అంబేద్కర్)*





## చిట్టిపొట్టి కథలు

20 పుస్తకాల సెట్టు

ఒక్కొక్క పుస్తకం రూ. 15/-

ఇరవై ఒకటో శతాబ్దంలో విద్యావిధానం తీరుతెన్నులు ఎలా ఉండాలన్న దానిమీద యునెస్కో ఒక అంతర్జాతీయ కమిషన్‌ని ఏర్పాటుచేసింది. ఆ కమిషన్ తన నివేదికకు 'అభ్యసనం: ఒక ఆంతరంగిక నిధి' అని పేరు పెట్టింది. ప్రపంచమంతా నేడు సంభవిస్తున్న పరిణామాల వల్లా, సమాచార విప్లవం వల్లా విద్యావిధానపు రూపుతెన్నులు మారిపోనున్నాయనీ, మనం జాగ్రత్త వహించకపోతే విద్యావకాశాలు మానవ సమాజాన్ని నిట్టనిలువుగా చీల్చేసే ప్రమాదం ఉన్నదని ఆ నివేదిక అంతర్జాతీయ సమాజాన్ని హెచ్చరించింది.

'మనం ఒక నిర్దిష్ట విద్యావిధానాన్ని కోరుకోవడమంటే ఒక నిర్దిష్ట సమాజ స్వరూపాన్ని కోరుకోవడమే'నని కూడా ఆ నివేదిక స్పష్టంగా చెప్పింది. మనం దేన్ని కోరుకుంటున్నాం? కొద్దిమంది అత్యధిక విద్యావంతులూ, అత్యధిక నిరక్షరాస్యులూ ఉండే సమాజాన్నా? కొద్దిమందికి రోజుకు నలభై ఎనిమిది గంటల పనీ, అత్యధికులకూ నిరుద్యోగమూ ప్రాప్తించే సమాజాన్నా? వైవిధ్యానికీ, వైరుధ్యాలకూ తేడా తెలియని సమాజాన్నా? మనిషి మనిషికి ఊడిగం చెయ్యక తప్పని సమాజాన్నా?

కానేకాదనే ఉపనిషత్తులు, దమ్మపదం మొదలుకుని యునెస్కో కమిషన్ వరకు మానవ ప్రేమికులంతా ఘోషిస్తూ ఉన్నారు. వస్తువుల్ని పోగుచేసుకోవడంకన్నా మనుషుల్ని చేరదీసుకోవడం అత్యుత్తమ విద్యాప్రయోజనమనీ, కంప్యూటర్ మీద పనిచెయ్యడంలోనూ, కసవు ఊడ్చటంలోనూ మానవశ్రమ విలువ ఒక్కలాంటిదేనని తెలియచెప్పవలసిన అవసరం నేటి విద్యావేత్తలకీ, పాఠశాలలకీ ఎంతో ఉంది. స్వీయకేంద్రిత విద్యనుంచి సమాజ కేంద్రిత విద్యవైపుగా విద్యావిధానం నడవవలసి ఉంది.

పిల్లలకీ, ఉపాధ్యాయులకీ, తల్లిదండ్రులకీ ఆ దిశగా దారిచూపించే పనిని ఈ పుస్తకాలు ఏ మేరకు సాధించగలిగినా మా ఉద్దేశ్యాలు సఫలమయినట్టే.



**Meeru Inti Nunchi Emi Nerchukovali?**
by **Chinaveerabhadrudu**
First Edition : January, 2005
Artwork - **V. Bhaskar**,
Samskriti Grameena Balala Kalakendram,
Hyderguda Village, R.R.Dist.